క్లుప్తంగా

ఎమ్మెల్యే పుష్కర స్నానం



నర్సంపేట : దక్షిణ భారతదేశ త్రివేణి సంగమంగా గుర్తింపు పొందిన కాళేశ్వరంలోని సరస్వతీ పుష్కరాల్లో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శుక్రవారం కుటుంబ సమేతంగా స్నానం ఆచరించారు. దీపారాధన నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీకాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయంలోనూ ఆయన కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. దేవా దాయ శాఖ అధికారులు, అర్చకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందించారు.

ఆలయంలో పూజలు



నల్లబెల్లి : మండల కేంద్రంలోని అభయాంజనేస్వామి ఆలయంలో అఖిల భారత హనుమాన్ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు, శ్రీరామ ధర్మ ప్రచారకుడు గాదెపాక రాములు స్వామి శుక్రవారం పూజలు నిర్వహించారు. తొలుత అఖండ జ్యోతిని వెలిగించారు. పహల్గాం ఉగ్రవాదుల దాడిని ఖండించారు.

సొసైటీ మాజీ చైర్మన్ మృతి



సత్యనారాయణ రెడ్డి (ఫైల్)

నర్సంపేట : చెన్నారావుపేట సొసైటీ మాజీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. చైర్మన్‌గా ఆయన రైతులందరికీ ఎనలేని సేవలు అందించారు. ఆయన మృతితో మండలంలో విషాదం నెలకొంది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు న్నారు. సత్యనారాయణరెడ్డి మృతదేహానికి పలువురు నివాళులర్పించారు.

యువకుడి ఆత్మహత్య

పర్వతగిరి : మండలంలోని పెద్దతండాకు చెందిన భూక్య యాకూబ్ (45) రేకుల షెడ్డులోని ఇనుప పైపునకు లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై బోగం ప్రవీణ్ కథనం ప్రకారం.. యాకూబ్ పెద్దతండాలోని ఇంట్లో ఉండగా పక్కింటికి చెందిన లూనావత్ మోతీలాల్ ఐస్‌క్రీమ్ బండిలోని డబ్బులు యాకుబ్ దొంగిలించాడని ఆరోపించడంతో గొడవ చోటు చేసుకుంది. దీంతో మనస్తాపానికి గురై యాకూబ్ ఉరి వేసుకున్నాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెట్టుకు ఉరేసుకుని..

ఖిలా వరంగల్ : మండల పరిధిలోని రామకృష్ణాపురం సమీపంలోని మామిడి తోటలో వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన ఎర్రం వెంకటేశ్వర్లు (54) చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. వెంకటేశ్వర్లు బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో హోటల్ నడిపిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వ్యాపారం సాగక.. అప్పులు తీర్చే పరిస్థితి లేకపోవడంతో కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో అతడి భార్య మందలించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపారు.

నివాళి

పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామానికి చెందిన షేక్ నూరొద్దీన్ (70) శుక్రవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుమారుడైన మండల మాజీ కో ఆప్షన్ మెంబర్ షబ్బీర్ పాషాను పరామర్శించారు. కార్యక్రమంలో పర్వతగిరి సొసైటీ చైర్మన్ మోటపోతుల మనోజ్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, నాయకులు మహ్మద్ గౌస్ పాషా, ఇస్మాయిల్, షబ్బీర్, ఖాజా పాషా, దబ్బెట నరేశ్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

దుగ్గొండి : మండల కేంద్రానికి చెందిన జర్నలిస్టు బైగాని వీరస్వామి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన్ను నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్నం మొగిలి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ యూత్ కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, నాయకులు కాట్ల భద్రయ్య, నీలం పైడయ్య, ఊరటి రవి, రవికుమార్, కామిశెట్టి ప్రశాంత్, సుధాకర్, శంకర్ పాల్గొన్నారు.

పల్లె దవాఖానాలో రోగుల వెతలు

- సమయపాలనలో ఉద్యోగుల నిర్లక్ష్యం



మహేశ్వరంలోని పల్లె దవాఖానా భవనం

నర్సంపేట రూరల్ : మండలంలోని మహేశ్వరంలోని పల్లె దవాఖానాలో రోగులకు వెతలు తప్పడం లేదని తెలుస్తోంది. ఉద్యోగులు సమయపాలనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో వైద్యం అందక రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామీణులకు స్థానికంగా సత్వరమే వైద్యసేవలు అందాలన్న వైద్యశాఖ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మహేశ్వరంలో ప్రభుత్వం రూ.13 లక్షల వ్యయంతో పల్లె దవాఖానా భవనాన్ని నిర్మించి గ్రామస్తులకు స్థానికంగా వైద్యం అందించేందుకు అందుబాటులోకి తీసుకొచ్చింది. వైద్యురాలు, ఏఎన్‌ఎంతోపాటు ఐదుగురు ఆశ వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగులు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోగులకు వైద్య సేవలు అందించాల్సి ఉంది. జ్వర, ఇతర అనారోగ్య పీడితులకు, గర్భిణులకు ఆస్పత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించడంతోపాటు అత్యవసర పరిస్థితుల్లో ఉన్నత శ్రేణి ఆస్పత్రికి పంపించాల్సి ఉంటుంది. కాగా వైద్యురాలు, ఏఎన్‌ఎం వరంగల్ నుంచి విధులకు ప్రతిరోజూ సుమారు 2 గంటలు ఆలస్యంగా వస్తూ గంట ముందుగానే వెళ్లిపోతున్నారని గ్రామస్తులు తెలిపారు. ఆస్పత్రికి జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలతో వచ్చే వారికి ఆశావర్కర్లే మందులు ఇస్తున్న పరిస్థితి నెలకొంది.

విచారణ చేస్తాం

మహేశ్వరం పల్లె దవాఖానాలో విధి నిర్వహణలో ఉద్యోగుల నిర్లక్ష్యం, సమయ పాలన పాటించకపోవడం మా దృష్టికి రాలేదు. విచారణ చేస్తాం. సమస్యలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తాం. రోగులకు వైద్యసేవలు అందే దిశగా చొరవ తీసుకుంటాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయి.

\- డాక్టర్ అరుణ్‌చంద్ర, వైద్యాధికారి, భాంజీపేట

వైద్యం అందక ప్రైవేట్ ఆస్పత్రులకు..

పల్లె దవాఖానాలో ఉద్యోగులు ఇష్టారీతిన విధులకు వచ్చి పోతుండడంతో వైద్యం అందక పలువురు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తోంది. పల్లె దవాఖానాకు ప్రతిరోజూ 25–30 మంది జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలతో రావడం పరిపాటి. కాగా వైద్యురాలు, ఏఎన్‌ఎం దాదాపు రెండు గంటలు ఆలస్యంగా ఆస్పత్రికి వస్తుండడంతో ఆశవర్కర్లే మందులు ఇస్తున్నట్లు పలువురు తెలిపారు. ఈ క్రమంలో వైద్య సేవలపై నమ్మకం సన్నగిల్లి బాంజీపేటలోని పీహెచ్‌సీకి లేదా నర్సంపేటలోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు చెప్పారు. ఇకనైనా ప్రభుత్వం, వైద్య శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉద్యోగులపై చర్యలు తీసుకోవడంతోపాటు రోగులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థులకు ప్రాథమిక విద్య కీలకం

- జిల్లా మానిటరింగ్ అధికారి సుజన్‌తేజ



వర్ధన్నపేట : మాట్లాడుతున్న సుజన్‌తేజ

వర్ధన్నపేట/గీసుకొండ/సంగెం/పర్వతగిరి : విద్యార్థుల భవిష్యత్‌కు ప్రాథమిక విద్య కీలకమని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంఓ) సుజన్ తేజ స్పష్టం చేశారు. వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద, సంగెం, గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ పరిధిలోని ధర్మారం, పర్వతగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలను శుక్రవారం ఆయన వేర్వేరుగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యాబోధన మరింత పటిష్టం చేయడానికే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు ఉత్తమ బోధకుడిగా ఎదిగితేనే విద్యార్థులు విజేతలుగా మారుతారని వివరించారు. ఉపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను పెంచుకుని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని సూచించారు. మొదటి సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ధర్మారం ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని రాష్ట్ర పరిశీలకుడు చైతన్య పరిశీలించారు. కార్యక్రమాల్లో ఎంఈఓలు మామునూరు శ్రీధర్, రాము, సాంబయ్య, గాయపు లింగారెడ్డి, ఆర్పీలు సదానందం, పరిపూర్ణాచారి, చరణ్, శివకుమార్, రమాదేవి, ప్రసూన, మహేశ్‌నాయక్, నరసింహారాములు, రాయపురెడ్డి, ఏకాంబరం, సాంబమూర్తి, శివప్రసాద్, శ్రీనివాస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో వేగం పెంచండి



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

- తహసీల్దార్ రాజ్‌కుమార్

నెక్కొండ : ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని నిర్వాహకులను తహసీల్దార్ రాజ్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఓ నాగరాజు, ఏపీఎం శ్రీనివాస్‌లతో కలిసి తహసీల్దార్ రాజ్‌కుమార్ శుక్రవారం సందర్శించి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని ప్రత్యక్షంగా పరీక్షించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనేందుకు సిద్ధంగా ఉందన్నారు. రైతులు ఆందోళనకు గురి కావొద్దని సూచించారు. మరో రెండ్రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్న క్రమంలో ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులకు అవసరమైన టార్పాలిన్లు, పాలిథిన్ షీట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఇటీవల మండలంలో కురిసిన వర్షానికి 97 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిపోగా వాటిని కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తామని వివరించారు.

‘ఇందిరమ్మ’ ఇళ్లు త్వరగా పూర్తి చేయాలి



ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకర్‌నాయక్

- ఎంపీడీఓ శంకర్‌నాయక్

పర్వతగిరి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ శంకర్ నాయక్ సూచించారు. మండలంలోని జమలాపురంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద 20 ఇళ్లకు ముగ్గు పోయగా 10 ఇళ్ల నిర్మాణం బేస్‌మెంట్ వరకు పూర్తయిందని చెప్పారు. మిగతా ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆరుగురికి మొదటి విడతలో రూ.లక్ష మంజూరు చేశామన్నారు. బేస్‌మెంట్ స్థాయిలో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేస్తే ప్రతి సోమవారం రూ.లక్ష ప్రభుత్వం నుంచి అందుతుందని వివరించారు. బేస్‌మెంట్ లెవల్ పూర్తయిన లబ్ధిదారులు, లెంటల్ లెవల్ పని చేసుకున్న వారికి రూ.లక్ష జమ అవుతాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణ పనుల్లో జాప్యం చేయొద్దని కోరారు.

తాటిచెట్ల తొలగింపుపై ఎక్సైజ్ సీఐ విచారణ



తాటిచెట్లను పరిశీలిస్తున్న సీఐ స్వరూప

వర్ధన్నపేట : గీత కార్మికుల ఫిర్యాదు మేరకు మండలంలోని ఇల్లంద శివారులో తాటిచెట్ల తొలగింపుపై ఎక్సైజ్ శాఖ సీఐ స్వరూప శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రామోజీ కుమ్మరిగూడెం రహదారి పక్కనున్న చెలక గట్లపై ఉన్న తాటిచెట్లను కొందరు అక్రమంగా తొలగించారన్న ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు తెలిపారు. తాటిచెట్లు పొలం గట్ల మీద, పట్టా, ప్రైవేట్ భూముల్లో ఉన్నా తొలగించాలంటే అనుమతి తీసుకోవాల్సిందేనని చెప్పారు. చెట్లను తొలగించిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి



మాట్లాడుతున్న బుచ్చిరెడ్డి

శాయంపేట : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని కొప్పుల, కాట్రపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. కొప్పుల గ్రామశాఖ అధ్యక్షుడిగా ఏరుకొండ శంకర్, ఉపాధ్యక్షుడిగా మామిడి, కాట్రపల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా వాంకుడోతు జగన్, ఉపాధ్యక్షుడిగా ఆరే కమలాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ మెంబర్ బాసాని చంద్రప్రకాశ్, నాయకులు చల్లా చక్రపాణి, అబ్బు ప్రకాశ్‌రెడ్డి, మారేపల్లి రవీందర్, దుబాసి కృష్ణమూర్తి, పోతు కృష్ణమూర్తి, రఘుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరె కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రంగారావు



దుగ్గొండి : ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన గుండెకారి రంగారావు నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపెల్లి శివాజీ శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రంగారావు విలేకరులతో మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు, రాష్ట్ర కన్వీనర్ జెండా రాజేశ్, స్టీరింగ్ కమిటీ చైర్మన్ దిగంబరరావు, రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మోర్తాల చందర్‌రావు, క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు మారడోజు రాంబాబులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆరె కుల పేదలకు, విద్యార్థులకు సహాయ సహకారాలు అందించడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

- ఏఓ హరిప్రసాద్ బాబు



మాట్లాడుతున్న ఏఓ హరిప్రసాద్ బాబు

గీసుకొండ : మండలంలోని ఊకల్ సొసైటీ రైతుల కోసం పచ్చిరొట్ట ఎరువుగా వినియోగించడానికి 50 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి (ఏఓ) హరిప్రసాద్ బాబు తెలిపారు. సొసైటీ ఆవరణలో శుక్రవారం ఆయన రైతులతో మాట్లాడారు. జీలుగ విత్తనాలను తొలకరి వర్షాలకు విత్తుకుని పూత దశకు ముందు భూమిలో కలియదున్నితే భూసారం పెరిగి పంట దిగుబడి అధికమవుతుందని తెలిపారు. 30 కిలోల జీలుగ విత్తనాల బస్తాను సబ్సిడీ పోగా రూ.2137కు అందిస్తున్నట్లు చెప్పారు. మరో 200 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు రానున్నాయని వివరించారు. ఆసక్తి కలిగిన రైతులు భూమికి సంబంధించిన పట్టాదారు పాసుబుక్కు, ఆధార్ జిరాక్స్‌లు ఏఈఓలకు అందించి పర్మిట్ పత్రాలు తీసుకుని విత్తనాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బి.రమేశ్, సీఈఓ రమేశ్, కౌంటర్ ఇన్‌చార్జ్ సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల మూసివేత మానుకోవాలి

- స్వేరోస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు సిద్ధు

దుగ్గొండి : రాష్ట్రంలోని 12 గురుకుల జూనియర్ కళాశాలలను మూసివేయాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం మానుకోవాలని స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు దూడెల సిద్ధు డిమాండ్ చేశారు. మండలంలోని గిర్నిబావిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే సాకుతో కులవివక్షత పాటిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం అడ్మిషన్ల ప్రక్రియను ఆలస్యం చేయడంతో విద్యార్థులు చేరడం లేదని తెలపారు. ప్రభుత్వ తప్పుడు నిర్ణయం వల్ల పేద విద్యార్థులు చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. మూసివేత నిర్ణయాన్ని మానుకోకపోతే ఉద్యమాలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు కిరణ్‌కుమార్, వినయ్, రణధీర్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సీపీఐ పోరాటం

జిల్లా సహాయ కార్యదర్శి భిక్షపతి



మాట్లాడుతున్న భిక్షపతి

శాయంపేట : కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి భిక్షపతి అన్నారు. మండలంలోని పెద్ద కోడెపాక రెవెన్యూ శివారులోని గుడిసెల వద్ద ఆ పార్టీ 2వ మహాసభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం పాలనలో విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంపై మోదీ ప్రభుత్వం కపట ప్రేమ చూపిస్తోందని, విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి, ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రైతు రుణమాఫీ పూర్తిగా అమలు చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ పారదర్శకంగా చేపట్టి అర్హులైన పేదలకు అందించాలని, గుడిసెవాసులకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, అసంపూర్తిగా ఉన్న దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కోసం జరిగిన పోరాటంలో సీపీఐదే అగ్రగామి పాత్ర అన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ, పట్టణాల్లో సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలపై, పేదలకు ఇళ్ల స్థలాల కోసం సీపీఐ రాజీలేని పోరాటం చేసిందని గుర్తుచేశారు.

మండల కమిటీ ఎన్నిక

మండల కార్యదర్శిగా బత్తిని సదానందం, మండల సహాయ కార్యదర్శిగా అనుకారి అశోక్, సముద్రాల రవి, 9మంది కార్యవర్గ సభ్యులను, 18 మందితో మండల కౌన్సిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు సాంబయ్య, వల్లాల రమేశ్, మైనొద్దీన్, సాంబయ్య, రమాదేవి, గౌసియా, రమాదేవి, కోమల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



పర్వతగిరి : ఈనెల 25న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఉద్యమకారుల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి గరుగు రాజు మండల కేంద్రంలో శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమకారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రౌండ్ టేబుల్ సమావేశానికి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యమకారులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను సత్వరమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు నాగరాజు, రమేశ్, తిరుమల్‌రావు, హరికృష్ణ, అశోక్, మధు, విజయ, శ్యామ్ గౌడ్, నాగరాజు, గఫార్, శ్రీనివాస్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



దుగ్గొండి : మండలంలో సీఆర్‌పీగా పని చేసిన ఇటీవల మృతి చెందగా ఉపాధ్యాయులు సమీకరించిన రూ.2.50 లక్షల నగదును భాస్కర్ కూతురు పేరిట బ్యాంకులో డిపాజిట్ చేసి బాండ్‌ను బాధిత కుటుంబానికి శుక్రవారం అందజేశారు. తొలుత భాస్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు, పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు పోలోజు భిక్షపతి, వాంకుడోతు వీరన్న, అసోసియేట్ అధ్యక్షుడు పరుపాటి సుధాకర్‌రెడ్డి, నాయకులు రఘు, భానుమూర్తి, డీటీఎఫ్ బాధ్యుడు శ్యాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

‘సఖి’ సేవలపై అవగాహన



గీసుకొండ : సఖి కేంద్రంలో అందుతున్న సేవలపై మండలంలోని కొమ్మాల, సూర్యతండా, విశ్వనాథపురం గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు కేస్ వర్కర్లు తిరుమల, స్వప్న శుక్రవారం అవగాహన కల్పించారు. మహిళలు, బాలికల భద్రత, రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి కేంద్రాలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. సఖి కేంద్రాల్లో బాధితులకు ఉచితంగా సేవలు అందుతాయని చెప్పారు. మహిళల హక్కులు, భద్రతపై వివరించారు. మహిళలు, బాలికలు అత్యవసర పరిస్థితుల్లో డయల్ 181కు ఫోన్ చేసి రక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రభాకర్, శారద, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

‘డ్రంకెన్ డ్రైవ్’లో జైలు శిక్ష

నెక్కొండ : డ్రంకెన్ డ్రైవ్ నేరానికి పాల్పడ్డ ఇద్దరికి న్యాయమూర్తి జైలు శిక్ష విధించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. వివరాలిలా.. ఈనెల 21న స్థానిక రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో ప్రొబేషనరీ ఎస్సై శ్రావణ్ ఆధ్వర్యంలో పోలీసులు పెట్రోలింగ్, వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మండలంలోని మడిపల్లికి చెందిన ఆంగోతు నవీన్, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుంజేడుకు చెందిన బోనగిరి నవీన్ మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరిని నర్సంపేట కోర్టులో హాజరుపర్చగా స్పెషల్ మెజిస్ట్రేట్ లక్ష్మీనారాయణ ఒక్కొక్కరికి 5 రోజుల సాధారణ జైలుశిక్షతోపాటు వెయ్యి రూపాయల చొప్పున జరిమానా విధించారు.

‘శిక్షణ శిబిరాలను విజయవంతం చేయండి’

ఖిలా వరంగల్ : ఈనెల 26 నుంచి 31 వరకు రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్లలో నిర్వహించనున్న జనసేవాదళ్ శిక్షణ శిబిరాలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు వరంగల్ నగర పరిధిలోని శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో శిక్షణ శిబిరాల వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించి మాట్లాడారు. శిక్షణకు సకాలంలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో జనసేవా దళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేశ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాష్‌మియా, పనాస ప్రసాద్, అశోక్, అనిల్, లక్ష్మణ్, రవీందర్ పాల్గొన్నారు.

బస్టాండ్ కూల్చివేత.. పోలీసులకు ఫిర్యాదు



కూలిపోయిన బస్టాండ్

దుగ్గొండి : మండలంలోని గోపాలపురంలోని దుగ్గొండి–నల్లబెల్లి ప్రధాన రహదారి పక్కన గ్రామానికి చెందిన మల్కిరెడ్డి ముకుందరెడ్డి అతడి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సుమారు 20 ఏళ్ల క్రితం నిర్మించిన బస్టాండ్‌ను గురువారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన దొనికెల రవి కూల్చివేశాడు. బస్టాండ్ కూలిపోయి ఉండడాన్ని శుక్రవారం తెల్లవారుజామున గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల పంచాయతీ అధికారి శ్రీధర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి రఘుపతి కూడా రవిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.